ప్రజాశక్తి
శనివారం 15 జులై 2023 5
పార్వతీపురం మన్యం



ఆగస్టు15లోగా ఆరోగ్య కేంద్రాలు అప్పగించాలి

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో నూతనంగా నిర్మిస్తున్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను ఆగస్టు 15లోగా పూర్తిచేసి అప్పగించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి అన్నారు పలు అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రాధాన్యతా భవనాల నిర్మాణాలను ఆయా లక్ష్యాలను పదిరోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. వెనుకబడిన ప్రాంతాల్లోని పాఠశాలల్లోని, అంగన్వాడీ కేంద్రాల పిల్లలకు ప్రత్యేక దృష్టితో బరువు తక్కువ ఉన్న, రక్తలేమి కేసులను గుర్తించాలని అన్నారు. సమావేశంలో జెసి ఆర్.గోవిందరావు, పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పిఒలు సి.విష్ణు చరణ్, కల్పనా కుమారి, డిఆర్ఒ జె.వెంకటరావు, డిఎంహెచ్ఒ డాక్టర్ బగాది జగన్నాథ రావు, డ్వామా పీడీ కె.రామ చంద్ర రావు, డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్, ఐసిడిఎస్ పిఒ కె.విజయగౌరి, డిఎస్‌డిఒ ఎస్.వెంకటేశ్వరరావు, సిపిఒ పి.వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛందంగా కాలువ పనులు చేస్తున్న రైతులు

జైకా నిధులు ఏమయ్యాయో?

- సొంత ఖర్చులతోనే గండ్లు పూడ్చుకున్న రైతులు
- అన్నదాతలకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదంకలాం ప్రధాన కాలువ ద్వారా సాగునీరు రైతులకు అందాలనే ఉద్దేశంతో గతేడాది 2న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పెదంకలాం ఆనకట్టు ఆధునీకరణ పనులకు జైకా నిధులు రూ.17 కోట్ల 30 లక్షలతో ప్రధాన కాలువ వద్ద శంకుస్థాపన చేశారు. పనులు మాత్రం ఒక్క అడుగు ముందుకు సాగలేదు. అయితే కాలువకు ఎక్కడపడితే అక్కడ గండిపడడం, పెద్ద పెద్ద పిచ్చిమొక్కలు కాలువ మధ్యలో పెరిగిపోవడంతో నీరు రాకుండా గడ్డి విపరీతంగా పెరిగిపోయింది. దీంతో రైతులే వారు సొంత డబ్బులు ఖర్చు పెట్టి కాలువ గండ్లుపూడ్చుకుంటున్నారు. కోట్లలో నిధులు ఉన్నా అధికారులు పనులు చేయకపోవడంతో కాలువ ద్వారా సాగునీరందక రైతుకు తలనొప్పిగా మారింది. ప్రతి ఏటా కోట్లాది రూపాయలు పెదంకలాం అభివృద్ధి పనుల కోసం ప్రారంభం నుంచి చివర వరకు సుమారు 25 కిలోమీటర్లు పొడవున ఉన్న కాలువ వల్ల 8వేల ఎకరాల్లో సాగు నీరు రైతులకు అందాలి. నాటి నుండి నేటి వరకు పూర్తిస్థాయిలో నీరు ఎప్పుడూ అందలేదు. కాలువ మరమ్మతుల కోసం అప్పట్లో రూ.30 కోట్లు ప్రతిపాదనలు పంపించగా రూ.17.30 కోట్లు జైకా నిధులు మంజూరయ్యాయి. మూడేళ్లవుతున్నా ఈ ఖరీఫ్‌కు పూర్తిస్థాయిలో సాగునీరందని పరిస్థితి నెలకొంది. దీనికి కారణం కాలువ పనులు సక్రమంగా జరగకపోవడం. ఇరిగేషన్ అధికారులు దూర ప్రాంతాల నుంచి నివసించడం, పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడం ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. ఒక దగ్గర 60 సెంటీమీటర్లు సైడ్ ర్యాంపు, మరో దగ్గర రెండు పక్కల సైడ్ ర్యాంపులు వేసి బేస్మెంట్ మర్చిపోయారు. కానీ నిధులు మాత్రం దోచుకున్నారు. హెడ్ దగ్గర సెంటర్లు మరమ్మతులకు గురయ్యాయి. కాలువల వద్ద గండ్లు ఏర్పడ్డాయి. పిల్ల కాలువలు సరిగ్గా లేవు. ఏ విధంగా చూసినా ప్రధాన కాలువ పనులు మరమ్మతులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు కనిపిస్తున్నాయి. ఇలా ఉంటే మరో పదేళ్లయినా కాలువ ద్వారా సాగునీరు రైతులు అందే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొంత డబ్బులు ఖర్చు పెట్టి రైతులు గండ్లు పూడ్చుకుంటున్న పరిస్థితి నెలకొంది. మండలంలోని వెంగాపురం, నారాయణపురం గ్రామానికి చెందిన సుమారు 100మంది రైతులు ప్రధాన కాలువలో ఒక గండిని పూడ్చారు. ఎమ్మెల్యే సొంత మండలంలోని తమకు ఇటువంటి సమస్యలు వెంటాడడం చాలా బాధాకరమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్లో సాగునీటికి ఆటంకాలు వస్తే తమ పరిస్థితి అధ్వానంగా మారుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. వెంటనే ఇరిగేషన్ అధికారులు స్పందించి కాలువ చివరి భూములకు నీరందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

ప్రధాన కాలువ పనులు చేపట్టాలి



పెదంకలాం ప్రధాన కాలువ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి రైతులకు సాగునీరందించాలి. లేని పక్షంలో సంబంధి కార్యాలయాల వద్ద రైతులతో నిరసన చేస్తాం.

వై.మన్మధరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు

సొంత డబ్బులతో గండ్లు పూడ్చుకుంటున్నాం



సొంత డబ్బులు ఖర్చు పెట్టి గండ్లు పూడ్చుకోవాల్సిన పరిస్థితి. కాలువ అభివృద్ధికి మంజూరైన నిధులు ఏమయ్యాయో. పనుల వద్ద ఇరిగేషన్ అధికారుల జాడేలేదు.

నాగభూషణ, రైతు

సాగునీరందించాలి



సాగునీరందించి రైతుల సమస్యలు పరిష్కరించాలి. రైతులకు ఉపయోగడే నిర్ణయాలను పాలకులు తీసుకోవాలి. ఒకవైపు రైతే రాజు అన్న నినాదాన్ని పాలకులు ఆచరణలో చిత్తశుద్ధి చూపాలి.

ఎగిరెడ్డి రామ్మోహన్ , రైతు



వైద్యాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

గర్భిణుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

మాతృ మరణాల సమీక్షలో కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రజాశక్తి - పార్వతీపురం

గర్భిణీల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్య ధోరణి వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ నిశాంత్ కుమార్ వైద్యాధికారులను హెచ్చరించారు. ఈ ఏడాది ఏప్రిల్ నుండి ఇప్పటి వరకు సంభవించిన మాతృ మరణాలపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సమీక్షకు మాతా, శిశు ఆరోగ్య రాష్ట్ర అదనపు సంచాలకులు డాక్టర్ కెవిఎన్ఎస్ అనిల్ కుమార్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ హనుమంతరావును నియమించారు. ఈ మేరకు మొండెంఖల్లు, దుడ్డుఖల్లు, జియ్యమ్మవలస, ఆర్ఆర్ బి పురం, మక్కువ, తోణాం పిహెచ్‌సి పరిధిలో సంభవించిన మాతృ మరణాలపై సమీక్ష నిర్వహించారు. అందుకు కారణమైన అంశాలపై, అందజేసిన వైద్య సేవలపై ఆయా వైద్యాధికారులు, వైద్య సిబ్బందిని అదేవిధంగా రిఫరల్ ఆసుపత్రిలో వైద్యులు అందజేసిన చికిత్సపై ఆరా తీశారు. ఏ విధమైన ప్రమాదకర సూచికలు మరణాలకు కారణమయ్యాయి విశ్లేషించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆశా కార్యకర్త నుండి జిల్లా అధికారి వరకు వారి పరిధిలో ఉండే గర్భిణీలను పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రమాదకర సూచికలు గుర్తించిన వెంటనే నివారణా చర్యలు చేపట్టి, అందుకు అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు వినియోగించాలని స్పష్టం చేశారు. వైద్య సిబ్బంది ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాన్పు సమయం దగ్గర పడుతున్న కొద్దీ హైరిస్క్ గర్భిణీ కాకపోయినప్పటికీ ఆ సమయంలో ఏవైనా ప్రమాదకర సూచికలు ఉన్నాయా అని గుర్తించడం చాలా ముఖ్యమని, అందుకు అవసరమైన పరిజ్ఞానం ప్రతి వైద్య సిబ్బందికి ఉండాలని ఆయన అన్నారు. అవసరమైన మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని ఆదేశించారు. సమావేశంలో సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారులు కల్పనాకుమారి, విష్ణుచరణ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ బి. వాగ్దేవి, జిల్లా ఆర్బిఎస్ కె అధికారి డాక్టర్ ధవళ భాస్కరరావు, నోడల్ అధికారి డిఐఒ డాక్టర్ టి.జగన్మోహనరావు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ వినోద్, డిప్యూటీ డిఎమ్ హెచ్ఒ లు డాక్టర్ విజయపార్వతి, డాక్టర్ వెంకటరమణ, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ నవీన్ , డాక్టర్ శ్యామ్ కుమార్, వివిధ ఆసుపత్రుల స్పెషలిస్ట్ వైద్యులు, మాతాశిశు ఆరోగ్య కన్సల్టెంట్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఇవిఎం గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్‌పి విక్రాంత్‌పాటిల్

ఇవిఎం గోడౌన్ పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈవిఎంలను భద్రపర్చిన గోడౌన్‌ను కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్‌పి విక్రాంత్ పాటిల్ శుక్రవారం పరిశీలించారు. త్వరలో జరగబోయే సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇవిఎం యంత్రాల స్థితిని పరిశీలించారు. గోడౌన్ దగ్గర పోలీసు బందోబస్త్‌ను, పరిసరాలను, గోడౌన్ లోపల సీలింగ్, గోడలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన జిల్లాలో త్వరలో జరగబోయే సాధారణ ఎన్నికలను పగడ్బందీగా నిర్వహించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు రాకూడదని ముందుగానే ఇవిఎం యంత్రాలను సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, డిఆర్ఒ జె.వెంకటరావు, ఆర్‌డిఒ కె.హేమలత, తహశీల్దార్ శివన్నారాయణ, డిఎఫ్ఒ ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతో భంజ్‌దేవ్ మళ్లీ భేటీ

నియోజకవర్గంలో పరిస్థితులపై వివరణ

ప్రజాశక్తి - సాలూరు

టిడిపి అధినేత చంద్రబాబునాయుడుతో మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్ మళ్లీ భేటీ అయ్యారు. బుధవారం నియోజకవర్గ సమీక్ష లో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. దీనిలో నియోజకవర్గ ఇన్చార్జి సంధ్యారాణితోపాటు భంజ్ దేవ్ పాల్గొన్నారు. అయితే గురువారం చంద్రబాబునాయుడుతో భంజ్‌దేవ్ మళ్లీ భేటీ కావడం చర్చనీయాంశమైంది. సుమారు గంటకుపైగా జరిగిన భేటీలో చంద్రబాబుకు భంజ్ దేవ్ నియోజకవర్గ రాజకీయ ముఖచిత్రం గురించి వివరించినట్లు తెలుస్తోంది. టిడిపిలో గత కొంతకాలంగా జరుగుతున్న పరిణామాలు, నియోజకవర్గ ఇన్చార్జి సంధ్యారాణితో మండల ప్రధాన బాధ్యులకు తలెత్తిన విభేదాల గురించి భంజ్ దేవ్ పార్టీ అధినేత చంద్రబాబుకు వివరించినట్లు సమాచారం. గత మూడు ఎన్నికల్లో టిడిపి ఓటమి పాలవుతున్న నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి అనుసరించాల్సిన వ్యూహంపై కూడా ఆయన చర్చించినట్లు భోగట్టా. నియోజకవర్గ నాయకులతో సమీక్ష అనంతరం మళ్ళీ చంద్రబాబు తో భంజ్ దేవ్ భేటీ కావడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.

ఇంజినీరింగ్ పనులు పూర్తి చేయాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ పరిధిలో చేపడుతున్న ఇంజనీరింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. శుక్రవారం పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. గిరిజన గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు రాకూడదన్నారు. సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. గిరిజన గ్రామాల్లో రోడ్ల నిర్మానానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిఒ ఒ.రోసిరెడ్డి పంచాయతీరాజ్ ఇఇ రాధారాణి, డిఇ లోకనాథం, గిరిజన సంక్షేమ శాఖ డిఇ కృష్ణకుమార్, సిమ్మన్న, డీఈ ఢిల్లీశ్వరరావు, ఇతర ఎఇలు తదితరులు పాల్గొన్నారు.



ఇంజినీరింగ్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న పిఒ కల్పనాకుమారి



కరపత్రాలను విడుదల చేస్తున్న ఆశా కార్యకర్తలు, నాయకులు

18న ఆశా వర్కర్ల ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఆశా కార్యకర్తలకు పనిభారం తగ్గించాలని కోరుతూ ఈనెల 18న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు తెలిపారు. ఈ మేరకు ధర్నా వాల్‌పోస్టర్లను శుక్రవారం విడుదల చేశారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర, కోశాధికారి జి.వెంకటరమణ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు పనిభారం తగ్గించాలని, సంబంధం లేని పనులు చేయించరాని, అధికారులు బెదిరింపులు, వేధింపులు ఆపాలని, నాణ్యమైన సెల్ ఫోన్లు ఇవ్వాలని, టిఎ, డిఎ లు ఇవ్వాలని, రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన ధర్నాకు జిల్లాలోని ఆశా కార్యకర్తలంతా పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.గౌరి, శివాని, త్రివేణి, భాగ్యలక్ష్మి, సుశీల, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జిల్లా పరిశ్రమల అధికారి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జిల్లా పరిశ్రమల అధికారిగా ఎంవి కరుణాకర్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాన్ని అందజేశారు. జిల్లాలోని ఔత్సాహికులను పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహాన్ని అందించాలని కలెక్టర్ ఆదేశించారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న పరిశ్రమలశాఖ అధికారి

బియ్యం ధరల నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

బిపిటి గ్రేడ్ -1 రకం బియ్యం కిలో రూ.48కు, ఆర్‌జిఎల్ గ్రేడ్ -1 రకం బియ్యం రూ.38, కంది పప్పు గ్రేడ్ -1 రకం రూ.137 లకు విక్రయానికి నిర్ణయం, బియ్యం ధరల నియంత్రణకు చర్యలు చేపట్టినట్టు జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బియ్యం, కందిపప్పు ధరల నియంత్రణ చర్యలపై శుక్రవారం మిల్లర్లతో చర్చించారు. బియ్యం, కంది పప్పు ధరల నియంత్రణలో మిల్లర్లు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ మేరకు రైతు బజారుల్లో బిపిటి గ్రేడ్ -1 రకం బియ్యం కిలో రూ.48కు, కందిపప్పు గ్రేడ్ -1 రకం రూ.137కు విక్రయించేందుకు నిర్ణయించారు. బయట ఏర్పాటు చేసిన ప్రదేశాల్లో ఆర్‌జిఎల్ గ్రేడ్ -1 రకం బియ్యం రూ.38కు విక్రయించేందుకు నిర్ణయించారు. పార్వతీపురం మెయిన్ రోడ్డులో కన్యకాపరమేశ్వరి దేవాలయానికి ఎదురుగా, పాలకొండలో రాజాం రోడ్డులో శ్రీ బాలాజీ మోడర్న్ రైస్ మిల్, సత్యనారాయణ రైస్ మిల్, సీతంపేట రోడ్డులో శ్రీ అప్పన్న మోడర్న్ రైస్ మిల్., సాలూరులో చిన బజారులో ఎం. వెంకట రావు షాప్ దగ్గరలో, నెయ్యల వీధిలో పశువుల ఆసుపత్రి పక్కన విక్రయాలకు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ధరల నియత్రణకు తోడ్పాటును అందిస్తూ ముందుకు వచ్చిన రైస్ మిల్లర్లకు ఆయన అభినందించారు. సమావేశంలో డిఎస్ఒ శివ ప్రసాద్, మిల్లర్లు పాల్గొన్నారు.

గిరిజన ఉపాధ్యాయురాలిని మోసగించిన

యువకుడిపై కేసు నమోదు

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన ఉపాధ్యాయురాలిని ప్రేమ పేరు వేధించిన యువకునిపై 8 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ సిహెచ్ ప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆరిక జోగులత(31) ఫిర్యాదు మేరకు మండలంలో గుమ్మ గ్రామానికి చెందిన కొనిస అభిషేక్ (27) పై పాలకొండ డిఎస్పీ కృష్టారావు ,సిఐ సత్యనారాయణ పూర్తి దర్యాప్తు అనంతరం యువకుడిపై వివిధ సెక్షన్లతో పాటు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ముద్దాయిని అదుపులోనికి తీసుకొని రిమాండ్ కి పంపినట్లు తెలిపారు.

అగ్నివీర్ వాయుసేనలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి కలెక్టరేట్

అగ్నిపథ్ పథకం ద్వారా అగ్నివీర్-వాయు సేనలో ఉద్యోగాల కోసం ఆన్‌లైన్ ద్వారా అవివాహిత పురుషులు, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించినట్లు విజయనగరం సెట్విజ్ సిఇఒ బి.రామగోపాల్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత వాయుసేనలో అగ్నిపథ్ స్కీం ద్వారా ఆగ్నివీర్- వాయు సేనలో ఉద్యోగాలకు ఇంటర్, డిప్లొమా పూర్తి చేసుకున్న అవివాహిత పురుషులు, మహిళా అభ్యర్థుల నుంచి ఆన్ లైన్ దరఖాస్తుల స్వీకరణ ఈనెల 27 నుంచి ఆగస్ట్ 17వరకు https://agnipathvayu.cdac.in వెబ్‌సైట్‌లో స్వీకరించనున్నట్టు తలెఇపారు. స్వీకరించబడునని తెలిపారు. లివిద్యార్హతలి : సైన్స్ కాకుండా ఇతర విభాగాల అభ్యర్థులకు అక్టోబర్ 13నుంచి రాత పరీక్ష ఉంటుందన్నారు. వాయు సేనలో పోస్టు లకు వచ్చేనెల 17లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కోరడమైనదని తెలిపారు. మరింత వివరాలు, నోటిఫికేషన్ కొరకు https://agni-pathvayu.cdac.in వెబ్ సైట్ ను సంప్రదించాలని తెలిపారు.

ఆణిముత్యాలను అందిస్తున్న 'జ్యోతి రావు పూలే'

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక మహాత్మా జ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల ఏటా ఆణిముత్యాలు లాంటి విద్యార్థినులను అందిస్తోంది. ప్రారంభం నుంచి అత్యుత్తమ ఫలితాలు సాధించడంతో పాటు జిల్లా, రాష్ట్ర స్థాయిలో అవార్డు అందుకున్న పాఠశాలగా గుర్తింపు పొందింది. 2018 డిసెంబర్‌లో బాలికల పాఠశాల ఇక్కడ ప్రారంభమైంది. 6నుంచి 8వ తరగతి వరకు 320మంది విద్యార్థినిలతో ఆరంభమై దినదినాభివృద్ధి చెందుతూ రాష్ట్ర స్థాయిలో ప్రాధాన్యత సంతరించుకుంది. ఏటా మెరికల్లాంటి విద్యార్థినులు ప్రతిష్టాత్మక ట్రిబుల్ ఐటిలకు ఎంపికవుతున్నారు. గడచిన మూడేళ్లలో 14మంది బాలికలు రాష్ట్రంలోని వేర్వేరు ఐఐఐటిలో సీట్లు సాధించుకున్నారు. ఇంతవరకు పాఠశాల నుంచి మూడు పదోతరగతి బ్యాచ్‌లు విడుదలయ్యాయి. ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న నేపథ్యంలో స్థానిక జ్యోతిరావుపూలే పాఠశాలలో చేరడానికి జిల్లా నలుమూలల నుంచి బాలికలు పోటీ పడుతున్నారు. 2021లో 50మంది విద్యార్థినులు పదోతరగతి పరీక్షలు రాయగా వందశాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో ముగ్గురు ఐఐఐటిలకు ఎంపికయ్యారు. 2021-22లో 74మంది పదోతరగతి పరీక్షలకు హాజర్వగా 73మంది ఉత్తీర్ణులయయ్యారు. వీరిలో 33మంది 500లకుపైగా మార్కులు సాధించారు. ఆరుగురు ఐఐఐటిల్లో సీట్లు సాధించారు. 2022-23లో 76మంది విద్యార్థినిలు పదోతరగతి పరీక్షలు రాయగా 72మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. ఇద్దరు ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణుల య్యారు. 37మంది 500లకు పైగా మార్కులు సాధించుకున్నారు. ఐదుగురు ఐఐఐటిలలో సీట్లు సాధించి ప్రతిభ కనబరిచారు. కర్రి షర్మిల, తెంటు యామిని, దమరుసింగు లత అనే విద్యార్థినులు నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. కర్రి యోజిత శ్రీకాకుళం ఐఐఐటిలో, కర్రి మోనీషా ఒంగోలు త్రిపుల్ ఐటిలో సీటు సాధించారు.

మూడేళ్లలో ట్రిపుల్ ఐటికి 14 మంది బాలికలు..
ఈ ఏడాది ఐదుగురు ఎంపిక



ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థిని, ప్రిన్సిపల్ (ఫైల్)

జగనన్న ఆణిముత్యాలుగా ఎంపిక

ఈఏడాది పదోతరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినిలు రాష్ట్ర స్థాయిలో జగనన్న ఆణిముత్యాలు అవార్డు సాధించుకున్నారు. నియోజకవర్గ స్థాయిలో 585మార్కులతో సాధించిన కర్రి షర్మిల రూ.15వేల నగదు బహుమతి, బంగారు పతకాన్ని అందుకున్నారు. 581మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిన తెంటు యామిని రూ.10వేల నగదు బహుమతి, రజిత పతకం సాధించారు. మహాత్మా జ్యోతి రావు పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల యాజమాన్యం పరిధిలో ప్రథమ స్థానంలో నిలిచిన కర్రి షర్మిలకు రూ.50వేల నగదు బహుమతి, బంగారు పతకం లభించింది. పాఠశాలకు జ్ఞాపిక లభించింది. 581మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిన తెంటు యామినికి రూ.30వేల నగదు, రజిత పతకం లభించాయి. 574మార్కులు సాధించిన దమరుసింగు లతకు రూ.15వేల నగదు బహుమతి లభించింది. పాఠశాల ప్రిన్సిపల్ మూకల పెంటయ్య జ్ఞాపిక అందుకున్నారు. పదోతరగతి పరీక్షల్లో కాక సాంస్కృతిక, సైన్స్, మేథ్స్ ఒలింపియాడ్ పోటీల్లో కూడా పాఠశాల విద్యార్థినులు అనేక పతకాలు సాధించారు.



ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించిన విద్యార్థినిలు

ఉత్తమ బోధనతోనే ఉత్తమ ఫలితాలు

మహాత్మా జ్యోతి రావు పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలల సొసైటీ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పాఠశాలలో విద్యార్థినులకు బోధన జరుగుతుంది. పాఠశాలలో పూర్తి స్థాయిలో బోధనా సిబ్బంది వున్నారు.స్టడీ అవర్స్ నిర్వహిస్తూ వెనుకబడిన విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తాం.

ఎం.పెంటయ్య, ప్రిన్సిపాల్,



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

హెల్త్ అలవెన్సులు చెల్లించకపోతే విధులు బహిష్కరణ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

హెల్త్ అలవెన్సులు చెల్లించకపోతే విధులను బహిష్కరిస్తామని మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు ప్రజారోగ్య అధికారి సిహెచ్ మురళితో మాట్లాడుతూ గత 4 నెలలుగా హెల్త్ అలవెన్సులు బకాయి రావాల్సి ఉందని, ఈ విషయంపై పలుమార్లు కమిషనర్ జె.రామప్పలనాయుడు దృష్టికి తీసుకెళ్లామని, తమ అకౌంట్లో జమ చేస్తామని చెప్పి మభ్య పెడుతున్నారని అన్నారు. ఈ శనివారం లోపు తమ అకౌంట్లో డబ్బులు జమ కాకపోతే విధులను బహిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో కార్మికులు రవి, సింహాచలం, మల్లేశ్, నిర్మల, సత్తిరాజు, శివ శంకర్రావు, సంతు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి - బెలగాం

పట్టణంలోని 15వ వార్డు గొల్ల వీధిలో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని జనసేన నాయకులు చందక అనిల్, రాజాన రాంబాబు, నెయ్యిగాపుల సురేష్, సిరిపురపు గౌరీ, మానెపల్లి ప్రదీప్, కొల్లి వెంకటరావు, సీతానగరం మండల అధ్యక్షులు పాతి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ వీధిలో పర్యటించిన వీరు డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ సమస్యను స్థానిక కౌన్సిలర్ పట్టించుకున్న పాపాన లేదన్నారు. ఎమ్మెల్యే జోగారావు కూడా గడప గడపకు కార్యక్రమంలో కాలువలు వేయిస్తామని మాటిచ్చి తప్పారని వాపోయారు. పక్కనే ఉన్న హాస్పిటల్‌కు సంబంధించి డ్రైనేజ్ కూడా ఈ కాలువలోనే కలుస్తుందన్నారు. హాస్పటల్ వ్యర్థాలన్నీ ఇళ్లలోకి చేరడంతో చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. తక్షణమే పూడికలు తీయాలని, కాలువలు వేయించాలని డిమాండ్ చేశారు.

46 వేల జీడి, మామిడి మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా ఈ ఏడాది "పండ్ల తోటలు పెంపకం" కార్యక్రమం లో ఇప్పటి వరకు సుమారు 670 ఎకరాలకు 46000 జీడి, మామిడి మొక్క లు పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ కొండపల్లి సత్యం అన్నారు. సీతంపేట హెచ్ఎన్‌టిసి ఫారం నుంచి రైతులకు మొక్కలు పంపిణీ చేశామని తెలిపారు. ఈ మొక్కలు రైతులు సంరక్షించుకొని ఆర్థికంగా అభివృద్ధి కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎపిఒ బాబూరావు, విద్యా సాగర్, టిఎలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

ఏగోటివలసలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని లక్ష్మీపురం గ్రామ సచివాలయం పరిధిలో గల ఏగోటివలసలో శుక్రవారం పెదలంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.రాధాకాంత్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు తనిఖీలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కురిటి రాధాకృష్ణ, ఎఎన్ఎం బి.రమాదేవి ఎంఎల్‌హెచ్ కె.కీర్తి, ఆశా కార్యకర్త పి.కృష్ణవేణి, 104 సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. అలాగే అంటిపేటలో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను సీతానగరం పిహెచ్‌సి వైద్యాధికారి కె.శిరీష పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - బలిజిపేట

ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు చిత్రలేఖనం పట్ల ఆసక్తి కల్పించాలని, వారి నైపుణ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల విద్యాశాఖ అధికారి -1 సామల సింహాచలం సూచించారు. శుక్రవారం నారాయణ పురం 2, రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలలను ఎంఇఒ ఆకస్మికంగా పర్యవేక్షించారు. నారాయణపురం 2 రెగ్యులర్ పాఠశాలల చిన్నారుల వర్క్ బుక్స్ పరిశీలించారు. సామాన్య శాస్త్రం పాఠ్య పుస్తకంలో గల మానవ శరీర నిర్మాణం, భాగాలు చిత్రాన్ని విద్యార్థులు వేస్తున్న తీరును పరిశీలించారు. నాడు-నేడు అదనపు భవనం, మరుగుదొడ్ల నిర్మాణాలు పరిశీలించి, తొందరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం తదితర రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని తగు సూచనలు చేశారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

ప్రజాశక్తి - సాలూరు

కరోనా అనంతరం విద్యార్థులు, యువకులు డిజిటల్ క్లాసులకు పరిమితమవుతున్న తరుణంలో ధ్యానంతో మానసిక ప్రశాంతత పొందవచ్చునని ఈశ్వరీయ బ్రహ్మకుమారీ విద్యాలయం ప్రతినిధి డికె లతక్కయ్య చెప్పారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ,పిజి కళాశాలలో విద్యార్థులకు డిజిటల్ డిశ్చార్జ్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కరోనా దృష్ట్యా విద్యార్థులకు డిజిటల్ తరగతులు ప్రారంభమయ్యాయని, దీనివల్ల విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతుందని చెప్పారు. ఈ ఒత్తిడి నుంచి బయటపడాలంటే ధ్యానం చాలా అవసరమని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాధాకష్ణ, వైస్ ప్రిన్సిపల్ వి.శ్రీనివాసమూర్తి, ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ కె.చిరంజీవి, అధ్యాపకులు నాయుడు, బికె శిల్ప, బికె పద్మ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక హనుమాన్ జంక్షన్‌లో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై కె.నీలకంత మాట్లాడుతూ మైనర్ పిల్లలు వాహనాల నడపరాదన్నారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలపై ఉన్న కేసులకు అపరాద రుసుం చెల్లించి కేసులను క్లియర్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

ఇంటింటి సర్వే సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - సీతానగరం

జగనన్న సురక్ష కార్యక్రమం ఇంటింటి సర్వే సక్రమంగా నిర్వహించాలని ఎంపిడిఒ ఎంఎస్ ప్రసాద్ అన్నారు. పెదభోగిలి సచివాలయం వద్ద వాలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్ల పరిధిలో ఉన్న ప్రతి ఇంటి ముందుగా గుర్తించి వారి సమస్యలపై తీసుకురావాలన్నారు. ప్రతి వాలంటీరు ఆయనకు కేటాయించిన పరిధిలోని ముందుగా తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎంబి రమణ, ఇఒపిఆర్‌డి కెకె వర్మ, సర్పంచ్ జె.తెరేజమ్మ, ఇఒ జి.వెంకట్రావు, వాలంటీర్లు పాల్గొన్నారు.

తృణధాన్యాల పెంపకానికి ప్రోత్సాహం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

గిరిజన గ్రామాల్లో తృణధాన్యాల పెంపకానికి ప్రాధాన్యతనిచ్చి గిరిజనులకు శతశాతం సబ్సిడీతో రాగులు, కొర్రలు విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్ అన్నారు. శుక్రవారం డోకిశీల, డికె పట్నం గ్రామాల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో గుర్తించిన గిరిజన రైతులకు 250 కేజీల రాగి విత్తనాలు, 100 కేజీల కొర్రలు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు కొండప్రాంతాల్లో పండించుకునేందుకు అనువుగా తృణధాన్యాలను ప్రోత్సహిస్తున్నామని అందుకు జిల్లావ్యాప్తంగా శతశాతం సబ్సిడీపై విత్తనాలు అందించి ప్రోత్సాహం కల్పిస్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో ఎఒ అశోక్, సచివాలయ అగ్రికల్చర్ సహాయకులు కె.రవీంద్రతో గిరిజన రైతులు పాల్గొన్నారు.




రైతులకు చిరుధాన్యాల విత్తనాలు అందజేస్తున్న జెడి రాబర్ట్ పాల్

జగనన్న సురక్షతో ప్రజల ముంగిటకే సేవలు

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

ప్రతి కుటుంబ సభ్యుని అవసరాలను తప్పక గుర్తించి వారికి జగనన్న సురక్ష కార్యక్రమాల ద్వారా మేలు జరిగేలా చూడాల్సిన బాధ్యత వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది ఉందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని వెంకంపేట, తాళ్లబురిడి గ్రామ సచివాలయాల్లో శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష క్యాంప్ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ముందుగా జగనన్న సురక్ష క్యాంప్ ఆవశ్యకతను, అవసరాన్ని ప్రజలకు వివరించి, కొత్తగా మంజూరైన ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి మజ్జి శోభారాణి, జెడ్‌పిటిసి బి.రేవతమ్మ, వైస్ ఎంపిపి సిద్ద జగన్నాధరావు, పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, ఎంపిడిఒ ఎస్.రమేష్, తహశీల్దార్ శివన్నారాయణ, సర్పంచులు వై.ప్రమీల, గండి శంకరరావు, ఎంపిటిసి సభ్యులు బంకురు రవికుమార్, మండల సీనియర్ నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, స్థానికులు పాల్గొన్నారు.

సాలూరు : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని తెలుసుకుని పరిష్కరించడానికే జగనన్న సురక్ష కార్యక్రమం చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ చెప్పారు. శుక్రవారం పట్టణంలోని ఆర్యవైశ్య ధర్మశాలలో 18, 19, 20, 21, 22 వార్డులకు సంబంధించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 11రకాల ధ్రువపత్రాలను విద్యార్థులకు, మహిళలకు అందజేశారు. అనంతరం చైర్ పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అవసరమైన ధ్రువపత్రాలను వెంటనే మంజూరు చేయడానికి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, వార్డు ఇంఛార్జిలు పిరిడి రామకృష్ణ, పి.వాసుదేవరావు, కమిషనర్ హెచ్ శంకరరావు , వైసిపి నాయకులు హరి బాలాజీ, పువ్వుల శ్రీనివాస్ భరత్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

కురుపాం : జగనన్న సురక్ష పథకం ద్వారా అర్హులై ఉండీ సంక్షేమ పథకాలకు మిగిలి ఉన్న వారి సమస్యలు పరిష్కారమవుతున్నాయని ఎంపిడిఒ వివి శివరామప్ప అన్నారు. మండలంలోని నీలకంఠాపురం పంచాయతీలో సర్పంచ్ ఎస్.మన్మధరావు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు అర్హులై ఉండీ ఇంకా మిగిలి ఉన్న వారు జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకుంటే వెంటనే పరిష్కరిస్తామన్నారు. కావున లబ్ధిదారులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బి.అన్నాజీరావు, ఎఎంసి మాజీ చైర్మన్ ఎస్.వెంకట్రావు, ఎంపిటిసి సభ్యులు రాజేశ్వరి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు ఆహ్వానం

పార్వతీపురం : శ్రీకాకుళం జిల్లా కళ్లేపల్లిలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న సంప్రదాయం - గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. కూచిపూడి నృత్యం శిక్షణ ఇచ్చేందుకు ఇక్కడ భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నామని ప్రిన్సిపల్ స్వాతీ సోమనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 9440 68 1083, 773 190 9837 అనే నంబర్లకు సంప్రదించాలని కోరారు.

డైట్ బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలలు, కళాశాల వసతి గృహాలకు గత విద్యా సంవత్సరం చెల్లించాల్సిన డైట్ బిల్లులు తక్షణమే చెల్లించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గత విద్యా సంవత్సరం బిల్లులు ఇప్పటివరకు చెల్లించకపోవడంతో విద్యార్థులకు పెట్టే మోనూపై తీవ్రమైన ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వీడాలని కోరారు. విపరీతంగా పెరుగుతున్న నిత్యావసర సరుకులు ధరలపై రంజిత్‌కుమార్ మాట్లాడుతూ సబ్సిడీపై సరుకులు ప్రజలకు అందివ్వాలని కోరారు.

'స్టూడెంట్' ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి -బెలగాం

పిడిఎస్ఒ ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఉత్తరాంధ్ర, రాయలసీమ విద్యార్థుల సదస్సులను నిర్వహించింది. ఈ రెండు సదస్సులను పురస్కరించుకొని తీసుకువచ్చిన ప్రత్యేక "స్టూడెంట్" సంచికను శుక్రవారం స్థానిక భాస్కర్ స్కూల్లో ఆవిష్కరించారు. ఈ సంచికను ప్రజా కళాకారుల సమాఖ్య నాయకులు, ప్రజా రచయిత రౌతు వాసుదేవరావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఉద్యమాల్లో పాల్గొనాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. పుస్తక పరిచయకర్త పిడిఎస్ఒ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.భాస్కరరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో ఎన్నో నదులున్నా వాటికి ఆనకట్టలు కట్టకుండా వదిలేయడం వల్ల ఏడాది వేల టిఎంసిల నీరు సముద్రంలో వృథాగా కలిసిపోతుందని, అదే ఆనకట్టలు నిర్మిస్తే ఈ ప్రాంతంలో సంవత్సరానికి మూడు పంటలు పండించవచ్చని తద్వారా మూసేసిన షుగర్, జ్యూట్ ఫ్యాక్టరీలను తెరిపించవచ్చని అన్నారు. అలాగే అనేక వ్యవసాయాధారిత పరిశ్రమలను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించవచ్చని అన్నారు. అయితే ఆ పనిని చేయడానికి ఏ ప్రభుత్వాలు ముందుకు రావడంలేదన్నారు. రాయలసీమలోనూ ఇదే పరిస్థితి ఉందన్నారు. అక్కడి ప్రజలు ఉపాధి లేక ఊర్లకు ఊర్లు పొరుగు రాష్ట్రాలకు వెళ్లి బతకాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఈ పరిస్థితుల్లో మార్పు రావడానికి ఇలాంటి పుస్తకాలు ఎంతో తోడ్పడతాయని కాబట్టి ప్రతి విద్యార్థి కూడా ఈ ప్రత్యేక స్టూడెంట్స్ సంచికను చదవాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో పిడిఎస్ఒ జిల్లా అధ్యక్షులు కె. సోమేష్, నాయకులు రాఘవ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎఒ అవినాష్

517 కౌలుకార్డులు జారీ

ప్రజాశక్తి - సీతానగరం

కౌలు రైతులకు ఇప్పటి వరకూ 517 ఇసిసిఆర్‌సి కార్డులు మంజూరైనట్లు మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాస్ తెలిపారు. మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ఖరీఫ్‌కు సంబంధించి రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇప్పటి వరకూ పచ్చిరొట్ట, వరి విత్తనాలు అందజేశామన్నారు. అలాగే కౌలు రైతులు కార్డులు ఇప్పటి వరకూ 517 మంజూరు చేశామన్నారు. వీటి ద్వారా భూమి లేని కౌలు రైతులు రైతు భరోసా పథకానికి అర్హులవుతారని తెలిపారు. ఇసిసిఆర్‌సి ఉపయోగించి పంటపై రైతులు రుణాలు కూడా తీసుకోవచ్చని, పంట నష్ట పరిహారం కూడా వర్తిస్తుందని తెలిపారు. ఆర్‌బికెల వద్ద ఎరువులు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు తీసుకోవచ్చని చెప్పారు. కంది విత్తనాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, కావున రైతులంతా తీసుకుని వరి గట్ల మీద వేయాలని సూచించారు. ఈ సంవత్సరం ఇ - పంట నమోదు జియోకో ఆర్డినేట్స్ ఆధారంగా నమోదు చేస్తున్నామని, కావున రైతులంతా తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి బి.రమణమ్మ, జెడ్‌పిటిసి ఎం.బాబ్జీ, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, విఎఎలు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి ఇద్దరు ఎంపిక

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో చదివి అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారు. వీరిలో టి.దివ్య, ఎన్.మనోహర్ శ్రీకాకుళం జిల్లా ట్రిపుల్ ఐటి విద్యాసంస్థకు ఎంపికైనట్లు హెచ్‌ఎం బిడ్డిక భీముడు తెలిపారు. గిరిజన ప్రాంతం నుంచి ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటిలో సీటు సంపాదించడం పట్ల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

నేడు నడుకూరులో జగనన్న సురక్ష

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడుకూరు, చిదిమి శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జి.జయంతి ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులంతా విధిగా కావాలని ఆయన కోరారు.

విధి నిర్వహణలో అశ్రద్ధ వద్దు

ప్రజాశక్తి - బలిజిపేట

ఈనెల 21 నుంచి ఆగస్టు 20వరకు బిఎల్‌ఒలు చేపడుతున్న ఓటరు జాబితా విషయంలో ఎటువంటి అశ్రద్ధ చూపొద్దని, విధి నిర్వహణలో అశ్రద్ధ చూపిన వారిపై చర్యలు తప్పవని తహశీల్దారు పి.అప్పలరాజు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బిఎల్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో భాగంగా బిఎల్‌ఒలు క్షేత్రస్థాయిలో చేసిన పనులు ఏరోజు పని ఆ రోజే పూర్తి చేసుకోవాలని, ప్రతిదీ రికార్డెడ్ గా తమ వద్ద ఉంచుకోవాలని అన్నారు. జాబితా తయారీలో స్థానిక అభ్యంతరాలకు ఒక తేదీను అధికారులు పర్యవేక్షణకు మరో తేదీని ప్రకటించడం జరిగిందని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జాబితాను బిఎల్‌ఒలు తయారు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు కిల్లాడ రత్నకుమారి, ఆర్ఐ రామచంద్రరావు, సీనియర్ అసిస్టెంట్ తిరుమల, ఎఎస్ఒ విజయరావు, సర్వేయర్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కేలీల ఏరివేతతో నాణ్యమైన విత్తనం

ప్రజాశక్తి - వీరఘట్టం

పంటలోనే మూడు దఫాలుగా కేలీలను తీయడం వల్ల మంచి నాణ్యమైన విత్తనాన్ని తయారు చేసుకోవచ్చని జిల్లా రిసోర్స్ కోఆర్డినేటర్ ఆర్.శ్రీనివాసరావు రైతులకు సూచించారు. శుక్రవారం ఎస్.నర్సిపురంలో గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకం ద్వారా ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ఈ పథకంలో 25 మంది రైతులకు 50శాతం రాయితీతో ఆర్‌జిఎల్ 2537 ఫౌండేషన్ సీడ్ ఇస్తామన్నారు. విత్తన ఉత్పత్తికి సంబంధించి నారుమడిలో యాజమాన్యం నుంచి విత్తనం ఉత్పత్తి చేసే వరకు మెలకువలు నేర్చుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. ఫౌండేషన్ సీడ్ నుంచి సర్టిఫైడ్ సీడ్ తయారు చేసుకొని మనమే విత్తనాలను గ్రామాల్లో పంచుకోవచ్చు తెలిపారు. పంట సాగు చేసే ముందు పచ్చిరొట్ట వాడడం వల్ల మంచి దిగుబడి వస్తుందని రైతులకు అవగాహన కల్పించారు. నారుమడ్లు తయారు చేసే విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ ఎడిఎ బి.శారద, పాలకొండ ఎడిఎ కె.రత్నకుమారి, శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మణరావు, మండల వ్యవసాయ అధికారి జక్కువ సౌజన్య, ఎఇఒ బి.కృష్ణకాంత్, రైతులు పాల్గొన్నారు.

ఎఎంసిల ద్వారా టమోటా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - సాలూరు

మార్కెట్‌లో టమాటా ధరలు కిలో రూ.150కు పైగా పలుకుతున్నందున సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా వ్యవసాయ మార్కెట్ కమిటీ, రైతు బజారుల ద్వారా పంపిణీ చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యాన సిఐటియు నాయకులు, కార్యకర్తలు మండల తహశీల్దార్ బాలమురళీకష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని దండిగాం రోడ్డులో రైతు బజారు నిర్మించి నిరుపయోగంగా వదిలేశారని చెప్పారు. రైతు బజార్ వినియోగంలో లేకపోవడంతో ధరల భారం సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఎక్కువగా ఉందన్నారు. పేదలకు అందుబాటులో వుండేలా టమాటాలను వ్యవసాయ మార్కెట్ కమిటీ, రైతు బజారుల ద్వారా పంపిణీకి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎల్.ఈశ్వరరావు, టి.శంకరరావు పాల్గొన్నారు.

కలెక్టరేట్ : అమాంతం పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో పాటు టమాటా, అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి ధరలు తగ్గించేందుకు తగు చర్యలు చేపట్టాలని జనసేన నాయకులు కోరారు. శుక్రవారం ఆ పార్టీ జిల్లా నాయకులు వంగల దాలి నాయుడు, అన్నాబత్తుల దుర్గాప్రసాద్, కర్రి మణి, కొల్లి వెంకటరావు, ఎస్. సంతు, కె.నాని తదితరులు పెరిగిన నిత్యావసర సరుకులు ధరలు తగ్గించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి పాలనలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో పాటు నిత్యావసర సరుకులు ధరలు పెరిగి సామాన్యుడిని భయపెడుతున్నాయన్నారు. వాటితోపాటు గత కొద్ది రోజులుగా టమాటా, అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి, ఎండుమిర్చి తదితర వాటి ధరలు పెరిగి సామాన్యుడు బతకలేని విధంగా ఆర్థిక అవస్థలకు గురి చేస్తున్నాయన్నారు. తక్షణమే ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే ధరలు పెరిగిన సరుకులను సబ్సిడీ ధరలకు రైతు బజార్లో ప్రభుత్వమే అమ్మకాలు చేయాలని కోరారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బలిజిపేట మండలానికి చెందిన జనసైనికులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న సిఐటియు నాయకులు

ధాన్యం కొనుగోళ్లలో విఫలం : ఎంపిపి

ప్రజాశక్తి - వీరఘట్టం

ఈ ఏడాది రైతుల నుంచి ధాన్యం కొనుగోలులో వ్యవసాయ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఎంపిపి డి.వెంకటరమణనాయుడు వ్యవసాయ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయాధికారుల తప్పిదం వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చిందని, అలాకాకుండా ముందస్తుగా అధికారులు ప్రణాళికలు తయారు చేసుకోవాలని అన్నారు. వ్యవసాయానికి సంబంధించి ఏ విధమైన సమావేశాలున్నా ఆ విషయాలను గ్రామస్థాయిలో సర్పంచులు, ఎంపిటిసిలకు సమాచారం అందించాలన్నారు. మీ నిర్లక్ష్యం వల్ల మాకు ప్రశ్నించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కర్రి లీలా ప్రసాదరావు మాట్లాడుతూ వర్షాభావం పరిస్థితి వల్ల విత్తనాలు మొలకెత్తక పోవడంతో తేలికపాటి విత్తనాలు తెప్పించి అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ఎఒ జక్కువ సౌజన్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా రిసోర్స్ ఎడిఎలు శ్రీనివాస్, శారద, పాలకొండ ఎడిఎ కె.రత్నకుమారి, జెడ్‌పిటిసి జంపు కన్నతల్లి -ఉమామహేశ్వరరావు, ఎంపిడిఒ జి.జయంతి ప్రసాద్, విఎఎలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి వెంకటరమణ నాయుడు

డెంగీపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - కురుపాం

డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా కురుపాం సబ్ యూనిట్ అధికారి ఎస్. నారాయణరావు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల నుంచి రావాడ జంక్షన్ వరకు డెంగీ నివారణపై వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ఆశావర్కర్లతో కలిసి ప్రజలకు అవగాహన పరుస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కురుపాం బస్టాండ్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు డెంగీ రాకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగా హన కల్పించారు. కార్యక్రమంలో మాదలింగి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎస్.సుప్రియా, హైస్కూల్ హెచ్‌ఎం టి.శంకరరావు, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, ఎంపీటీసీలు బంగారు నాయుడు, టివిఎస్ సోమయాజులు, యస్ సంస్థ డైరెక్టర్ షేక్ గౌస్, విద్యార్థులు పాల్గొన్నారు.



కురుపాం : డెంగీపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

గుమ్మలక్ష్మీపురంలో డ్రైడే ఫ్రైడే

గుమ్మలక్ష్మీపురం : స్థానిక సర్పంచ్ బొత్తాడ గౌరీశంకర్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కేంద్రంలో పలు వీధుల్లో మురికి కాలువలు, మంచినీటి బావుల్లో క్లోరినేషన్ చేయించి మంచినీటి బావులు చుట్టూ ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించారు. అలాగే మంచినీటి బావుల చుట్టూ బ్లీచింగ్ పౌడర్ చల్లించి పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం ఆయన ప్రజలతో మాట్లాడుతూ, మంచినీటి బావుల ఆవరణలో పరిశుభ్రంగా ఉంచుకొని చెత్తా, చెదారం పేరుకుపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉండాలన్నారు. మంచినీటి బావులు వద్ద మురుగు పేరుకు పోతే దోమలు వ్యాపించి పలు వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు మంచినీటి బావులు, బోరు, మురికి కాలువలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

చిట్టపూడివలసలో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం : మండలంలోని చిట్టపూడివలసలో శుక్రవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఓ.శాంతికుమారి, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నబగ్గలో గడపగడపకు...

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని చిన్నబగ్గ సచివాలయంలో గడప గడపకు - మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాలకొండ ఎమ్మెల్యే కళావతి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందుతున్నదీ, లేనిదీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూ, మరో పక్క ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ హిమరక మోహన్ రావు, వైస్ ఎంపిపి కుండంగి సరస్వతి, ఎంపిడిఒ కె.సత్యం, వైద్యాధికారి సాయిచరణ్ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

అంతర పంటలకు అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి - పాచిపెంట

ఏక పంట పండించే కంటే అంతర పంటలు వేసుకుంటే స్థిరమైన, నమ్మకమైన ఆదాయం వస్తుందని, కావున రైతులు అంతర పంటలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మండడల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని కేసలి, కోటికిపెంట, అమ్మవలసలో పంటలను పరిశీలించిన అనంతరం రైతులతో మాట్లాడుతూ ఏకపంట విధానం విపరీత వాతావరణ పరిస్థితులను తట్టుకోలేదన్నారు. అంతర పంటల విధానం పాటిస్తే ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొని ఆదాయం వచ్చే అవకాశం ఉందని అన్నారు కార్యక్రమంలో విఎఎలు రాకేష్ కుమార్, మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ద్విచక్ర వాహనాలు ఢీకొని నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రానికి సమీపాన గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు యువకులు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం కురుపాం సమీపాన గల రిజర్వు మామిడి చెట్టు డౌన్‌లో ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్ లు బలంగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో కురుపాంకు చెందిన ఎ.రోహిత్ , కోమల్ సాయి, ఇందిరా నగర్‌కు చెందిన సతీష్, గొయ్యిపాకకు చెందిన యాకోబు గాయపడ్డారు. క్షతగాత్రులను కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రాథమిక చికిత్స అందించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం నుంచి ఒడిశాకు రెండు ఆటోలతో రెండు టన్నుల పిడిఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా శ్రీకాకుళం విజిలెన్స్ పోలీసులకు ముందస్తు సమాచారం మేరకు విజిలెన్స్ ఎస్ఐ రామారావు తన సిబ్బందితో కలిసి కురుపాం సమీపంలో గల మూలిగూడ జంక్షన్ వద్ద శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు టన్నుల పిడిఎస్ బియ్యం స్వాధీనం చేసుకోవడం జరిగిందని, వీటి విలువ సుమారు రూ.76వేలు ఉంటుందని తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని వాహనాలతో సహా రెవెన్యూ సిబ్బందికి అప్పగించామని చెప్పారు. పిడిఎస్ బియ్యాన్ని అమ్మిన, తరలించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఎస్‌డిటి ఎ.సాంబమూర్తి, విజిలెన్స్ హెడ్ కానిస్టేబుల్ పురుషోత్తం, కానిస్టేబుల్ ఈశ్వరరావు, విఆర్ఒ మహేంద్ర పాల్గొన్నారు.